ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

సిపిఐ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి పిలుపు

విశాలాంధ్ర - చింతపల్లి : జూన్ 27 నుంచి 30 వరకు అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటి పట్టణంలో నిర్వహించు ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. చింతపల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు అధ్యక్షతన గిరిజన సమాఖ్య జిల్లా మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మహాసభను ఉద్దేశించి మాట్లాడుతూ వామపక్ష పార్టీలకు ప్రజా సంఘాలు పట్టుకొమ్మలు అన్నారు. 2004లో అప్పటి ప్రధాన మన్మోహన్ సింగ్ ప్రభుత్వానికి 63 మంది వామపక్ష పార్లమెంట్ సభ్యులు మద్దతు అవసరమైనప్పుడు పోడు భూములకు పట్టాలు, ఉపాధి హామీ పథకం చట్టాన్ని తీసుకురావడానికి ముఖ్య కారణం సిపిఐ పార్టీ అన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర చరిత్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారయ్యిందన్నారు. కనీస మౌలిక వసతులు కరువై అభివృద్ధి అందని ద్రాక్షగా మారిందన్నారు. కేంద్ర రాష్ట్రాలలో అభివృద్ధి జరిగిపోతుందని పాలక పక్షాలు ప్రకటించుకోవడం తప్ప నేటికీ రహదారి, రవాణా సదుపాయాలు లేని గిరి గ్రామాలు వందల సంఖ్యలో ఉన్నాయన్నారు. రక్షిత త్రాగునీరు లేక ఊట జలాలే ఊపిరిగా గిరిజనులు కాలం గడుపుతున్నారన్నారు. 32 తెగలు గల గిరిజన జాతులున్న అల్లూరి జిల్లాలో నేటికీ డోలిమోతలు తప్పడం లేదన్నారు. ప్రభుత్వాలు ఎక్కడ అభివృద్ధి మంత్రం జపించినా వాటి వలన నష్టపోయేది గిరిజనులే అన్నారు. రిజర్వేషన్లు అమలు కావాలంటే ప్రభుత్వ రంగం ఉండాలని ఈ ప్రభుత్వాలు దాన్ని ప్రైవేటుపరం చూసి రిజర్వేషన్లను నీరు గారుస్తున్నారన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్రంలోని బిజెపి 9 ఏళ్ల పాలనలో అభివృద్ధి 90 ఏళ్లు వెనక్కి పోయిందని ఆయన ఆరోపించారు. గిరిజన సమాఖ్య బలోపేతం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మన్యప్రాంత గళం వినిపించి చట్టాలు, హక్కులు కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో గల 26 జిల్లాలలో గిరిజన సమాఖ్య జిల్లా మహాసభలు నిర్వహించుకుని జూన్ 27 నుంచి 30వ తారీకు వరకు రాయలసీమ (అన్నమయ్య) జిల్లా రాయచోటి పట్టణంలో జరుగు రాష్ట్ర వ్యాప్త గిరిజన సమాఖ్య మూడవ మహాసభలకు అన్ని జిల్లాల నుంచి వేలాదిగా గిరిజన సమాఖ్య సభ్యులతోపాటు, సిపిఐ పార్టీ శ్రేణులు తరలివచ్చి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అల్లూరు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, గిరిజన సమాఖ్య బాధ్యులు మాకిరెడ్డి రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి, సెగ్గే కొండలరావు, ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గే సత్తిబాబు, జీ కే వీధి మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు, సీనియర్ నాయకులు కుజ్జన్న, గోపాలరావు, చిన్నారావు, సతీష్, చింతపల్లి, జీ కే వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు పంపిణీ : కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీకి సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. వ్యవసాయ సలహా మండలి సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ, కమ్యునిటీ హైరింగ్ కేంద్రాల ద్వారా జూన్ ఒకటిన రూ. 75 లక్షల విలువగల వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. ఇందులో 40 శాతం సబ్సిడీ, 10 శాతం లబ్దిదారు వాటా కాగా మిగిలిన 50 శాతం బ్యాంక్ ఋణం ఉంటాయన్నారు. అదేవిదంగా ఈ నెల 30 న రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా కార్యక్రమంలో లబ్దిదారులకు రాష్ట్రం తరుపున రూ. 5000, కేంద్రం తరుపున రూ.2500 అందించటం జరుగుతుందన్నారు.

రైతులకు అండగా ఉండాలి

గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులకు అండగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వారి పని తీరు బాగా లేదని, క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పటికీ కార్యాలయంలో రైతులకు కూడా అందుబాటులో ఉండాలన్నారు. అనేక సమస్యలపై సందేహ నివృతి కోసం వచ్చే రైతులకు అవగాహన కలిగే విధంగా వారితో మాట్లాడాలని ఆదేశించారు. గ్రామ సహాయకులు హాజరును వేసి ఫోటోలు జిల్లా వ్యవసాయాదికారికి పంపాలని, జిల్లా వ్యవసాయాదికారి ప్రతి రోజు వాటిని పిడీయఫ్ రూపంలో తనకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సహాయకుల సేవలు అందించటంలో విఫలమైతే చర్యలు తీసుకుంటామని, సర్వీస్ నుండి తొలగించటానికి కూడా వెనుకాడబోనని హెచ్చరించారు. శాశన సభ్యురాలు కే. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, మండలాల వారీగా రైతులకు బ్యాంకు రుణాలు తిరిగి చెల్లించటంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సరస్వతి మాట్లాడుతూ గతంలో ఐటిడిఎ ద్వారా పవర్ వీడర్స్ కు డబ్బులు చెల్లించినప్పటికీ యంత్రాలు కొంతమందికి రాలేదని కలక్టర్ దృష్టికి తీసుకు రాగా కలక్టర్ స్పందిస్తూ ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ను సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు బి.ఎస్.ఎస్. నందు, పి రమేష్, డ్వామా పిడి రమేష్ రామన్, మార్కెటింగ్ ఎడి రాకేశ్, మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అరసానికి 'కేతు' సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - విశాఖ : ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి తన జీవితకాలమంతా అరసంకి సేవలందించారని అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభ శనివారం ద్వారకానగర్ లోని విశాఖ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు పదేళ్ళపాటు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా అరసం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. యూపీఎస్సీ మాజీ సభ్యులు కె ఎస్ చలం మాటాడుతూ కేతు విశ్వనాథరెడ్డి తెలుగు కథకు ధర్మరాజు వంటి వారన్నారు. ఆయన రాసిన కథలు తెలుగు కథా సాహిత్యంలో అగ్రస్థానంలో ఉంటాయని అభివర్ణించారు. డాక్టర్ డివి సూర్యారావు మాట్లాడుతూ కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం మొత్తం వివిధ భాగాలుగా విభజించి ప్రచురింపజేయడం చాలా గొప్ప సాహిత్య కృషిగా భావించాలని అన్నారు. ఎల్ఆర్ స్వామి మాట్లాడుతూ రాయలసీమ బిడ్డయిన కేతు రాయలసీమ ప్రజల జీవితంలోని వివిధ సమస్యల్ని తమ యాసలోనే కథలుగా చిత్రీకరించారని అన్నారు. అరసం అధ్యక్షులు ఏ.సీతారత్నం మాట్లాడుతూ కేతు గొప్ప మానవతావాది అని, విద్యా రంగంలో అనేక స్థాయిల్లో పనిచేసి చాలా అవసరమైన మార్పులు తీసుకు వచ్చారని అన్నారు. ఈ సంస్మరణ సభలో అరసం ఉపాధ్యక్షులు ఎస్ హనుమంతరావు, కార్యదర్శి క్షేత్రపాల్ రెడ్డి శేఖరమంత్రి ప్రభాకర్ అడపా రామక్రిష్ణ శిరేల సన్యాసిరావు, కె. మధుసూధన్, ఎం.సుబ్బారావు, వరవస్తుసూరి, పిఏ.రాజు, బొట్ట అప్పారావు తదితరులు ప్రసంగించారు.

అసంఘటిత రంగ కార్మికులంతా ఈ - శ్రమలో నమోదు చేసుకోవాలి

కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రవేశ పెట్టిన ఈ - శ్రమ రిజిస్ట్రేషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖ పట్నం జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులుగా ఉన్న వారంతా ఈ శ్రమ రిజిస్ట్రేషన్ లో నమోదు చేసుకోవచ్చని ఆమె తెలియజేశారు. విశాఖ జిల్లాలో ఐసిడిఎస్ విభాగంలో పనిచేస్తున్న అంగన్వాడి వర్కర్లు, ఆయాలు దాదాపు 10000 మంది పని చేస్తున్నారని, విద్యా శాఖలో 10 వేలు మంది, వైద్య శాఖలో 5000 మంది, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పరిధిలో 50,000 మంది అసంఘటితరంగా కార్మికులు ఉన్నారని గుర్తించామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్ ఆర్ జీ ఎస్ లో 79 వేల మంది వర్కర్లుగా పని చేస్తున్నారని, డి ఆర్ డిఏలో ఎస్ హెచ్ జి గ్రూప్స్ లో పదివేల మంది మహిళలు ఉన్నట్లు గుర్తించామన్నారు. జీవీఎంసీ పరిధిలో వీధి విక్రయదారులు దాదాపు 4 లక్షల 89 వేల మంది ఉన్నారని, మొత్తం విశాఖలో 5,82,946 మంది అసంఘటితరంగా కార్మికులు ఉన్నట్లు గుర్తించామని, ఇప్పటి వరకు కేవలం 1,50,000 మంది మాత్రమే ఈ శ్రమ పోర్టల్లో నమోదు చేసుకున్నారని డిసి తెలిపారు. ఈ ఎస్ ఐపిఎఫ్ సభ్యత్వం లేనివారు, 16-59సం" వయస్సు గల వారు, ఈపోర్టల్లో నమోదుకు అర్హులు అని తెలియజేశారు. పోర్టల్ లో నమోదు విధానం కు ఈ - శ్రమ పోర్టల్లో రిజిస్ట్రేషన్ కొరకు ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరము లేదని, మీ సమీప సిఎస్సి సెంటర్లు, ఎస్ఎస్కె సెంటర్లు, మీ దగ్గరలో ఉన్న గ్రామవార్డు సచివాలయం దగ్గర, మరియు web.umang.gov.in ద్వారా ఈశ్రం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. నమోదుకు అవసరమైన ఈ పత్రాలను తీసుకువెళ్లాలని కోరారు.ఆధార్ తో అనుసం దనమైన మొబైల్ నంబరు, ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు పాస్ పుస్తకం, నామినీ యొక్క ఆధార్ కార్డు, సరిపోతాయన్నారు. ఈపథకం యొక్క లాభాలు ఎన్నో ఉన్నాయని తెలియజేశారు.

ఏజెన్సీలో భూ రక్ష ప్రోగ్రామ్ ద్వారా రీ సర్వే వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - రంపచోడవరం : ఏజెన్సీలోని వైయస్సార్ ఊహకు భూ రక్ష ప్రోగ్రాం ద్వారా రీ సర్వే వేగవంతం చేయాలని సర్వే రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పి. కె.జెయ కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో ఏడు మండలాలకు సంబంధించిన మండల సర్వేయర్లతో. సచివాలయ సర్వేర్లతో సర్వే రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పి. కెజెయ కుమారి. జాయింట్ డైరెక్టర్ సిహె. వి. యస్. యన్. కుమార్. జిల్లా సర్వే భూ రికార్డుల అధికారి వై. మోహనరావు. ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు . సర్వే వేగవంతం కొరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిడి పి. కెజెయ కుమారి మాట్లా డుతూ ఏజెన్సీలోని ప్రభుత్వ భూములు. ప్రైవేట్ భూములు రికార్డులు పక్కాగా పరిశీలించి రైతులకు నష్టం లేకుండా భూహక్కు భూరక్ష ప్రోగ్రాం ద్వారా సర్వే చేయాలని ఆమె అన్నారు. ప్రతి మండలంలోని సర్వేర్లకు టార్గెట్ ఇవ్వడం జరుగుతుందని టార్గెట్ ప్రకారం సర్వే చేయాలని ఆమె అన్నారు. రీ సర్వే చేయు టకు ఆయా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించాలని ఆమె అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ భూ భూములలో సర్వే ప్రారంభించిన నాటి నుండి వంద రోజులలో పూర్తి చేయాలని ఆమె అన్నారు. అదే విధంగా ఈరోజు ఉదయం దేవి పట్టణ మండలం రాయవరం గ్రామంలో సర్వే ఏ విధంగా చేయుచున్నది పరిశీలించడం జరిగింది. ఈ సమా వేశంలో డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పె క్టర్లు రవిశంకర్. రాజశేఖర్. నాగ భూషణం. మండల సర్వేయర్లు. గ్రామ సచి వాలయాలకు సంబంధించిన సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఔట్లను పరిశీలించిన ఎంపీడీఓ

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలోని న్యాయంపూడి గ్రామంలో ప్రతిష్టాత్మక నిర్మిస్తున్న జగనన్న లేఔట్ లో గృహ నిర్మాణాలపై శనివారం ఎండిఓ దెందుకూరు సీతారామరాజు క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడున్న లబ్ధిదారులతో మాట్లాడారు. వారి నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి ఆటంకాలు లేకుండా అధికారులు మీకు అందుబాటులో ఉంటారని త్వరితగతంగా నిర్మించు కోవాలని సూచించారు. ప్రధానంగా రహదారుల సమస్యను లబ్ధిదారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎన్ని గృహ నిర్మా ణాలకు బిల్లులు అయ్యాయి అవని వాటికి ప్రత్యేకంగా పూర్తి చేయాలని, ఇంజనీరింగ్ సిబ్బందికి హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డి వెంకట్ నారాయణ పంచాయతీ కార్యదర్శి నర సింహరాజు, రెవెన్యూ కార్యదర్శి శ్రీను, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ నాయుడులు ఉన్నారు.

అతి వేగం ప్రమాదకరం.. భద్రత పాటించండి

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం ఇంటర్ సెప్టర్ వాహనాల సిబ్బంది సంయుక్తంగా పెద్దిపాలెం బ్రిడ్జ్ కొత్త నేషనల్ హైవే 16తో స్పీడ్ గన్ సహాయంతో హైవేపై అతివేగంగా నడిపే వాహనాలకు జరిమానా విధించారు అందులో భాగంగా కార్లు 152, మోటార్ సైకిల్స్ 4, ఆర్టిసి బస్సు ఒకటి ,ప్రైవేట్ బస్సు ఒకటి, లారీ ఒకటి, మొత్తం మీద 159 వాహనాలకు గాను 70,200 రూపాయలు అపరాధ రుసుము విధించారు. రోడ్డుపై నడిపే వాహనాలను భద్రతతో పాటు నెమ్మదిగా అతివేగంగా నడిపి ప్రాణాలు మీదకు తెచ్చుకోకుండా అలాగే వాహనదారులకు ఇబ్బంది జాగ్రత్త తీసుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం తెలిపారు.

రాజ్యసభ సభ్యుల నిధులతో అభివృద్ధి

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 92వ వార్డు బంట కాలనీలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్, జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు, ఆదిరెడ్డి మురళి, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు స్థానిక నాయకులు పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్ రాజు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి నిధులతో ఈ కాలనీ అభివృద్ధి చేస్తామని బంట కాలనీ నాకు కలిసి వచ్చే ప్రదేశం అని అందుకే కాలనీ అభివృద్ధికి రాజ్యసభ సభ్యులు నిధులు వెచ్చి స్తున్నామని అందుకు ఎంపీ కూడా అంగీకరించారని త్వరలో ఆయనను ఇక్కడికి తీసుకొచ్చి పరిస్థితులు వివరిస్తామన్నారు. ఎంత నిధులు అవసరమో అంత ఇస్తారని రాజ్యసభ నిధులు ఎక్కడైనా విడుదల చెయ్యొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో 91వ అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు 92వ వార్డు అధ్యక్షులు జి.అప్పలస్వామి నాయుడు, గేదెల మురలీకృష్ణ, నగర అధికార ప్రతినిధి యతి రాజుల నాగేశ్వరరావు, కంచిపాటి జగదీష్ కుమార్, జావాన శంకర్, షేక్ వల్లి, కంపర సత్తిబాబు, బండారు శ్రీనివాసరావు, అప్పలరాజు, సింహాచలం, చినబాబు, ఆర్పి రమణమ్మ, వాలంటరీలు, సచివాలయం సిబ్బంది, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణిలో ప్రభుత్వ విధానాలకు తూట్లు : శేషు



విశాలాంధ్ర - యలమంచిలి : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నాడు జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న పురుషోత్తపురం వైస్ ఎంపిపి రాజానా శేషు మాట్లాడుతూ తన గ్రామంలో సచివాలయ అధికారుల ప్రత్యేక జోక్యం వలన ప్రభుత్వ విధానాలకు తూట్లు పడుతున్నాయని ఆరోపించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రతీ ఆరునెలలకొకశారి నూతన పెన్షన్లు మంజూరవుతున్న విషయం అందరికి తెలిసినదే కాకపోతే తన గ్రామ కాపరస్థుడైన యిత్తంశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తికి తన అల్లుడు డిసిటీఓ కావడంతో కేవలం దరఖాస్తు చేసుకున్న 3 నెలలకె అదీ మొత్తం పెన్షన్ ఒకేసారి తన ఖాతాలో పడిందని అదెలా సాధ్యం అని, ఎంతోమంది పేదలు దరఖాస్తులు చేసుకున్నప్పటికి పెన్షన్లు రావడం లేదని అదే విషయమై తనని సంప్రదిస్తే అధికారులకు తను కూడా అభ్యర్థిస్తున్నానని కానీ ప్రభుత్వ ప్రజాప్రతినిధిగా ఉన్న తనకి కూడా తెలియకుండా తన గ్రామంలో నూతన పెన్షన్ 3 నెలల్లో పెన్షన్ అవ్వడాన్ని చూస్తుంటే గ్రామానికి సంబంధించి ఇక తానేందుకు, మండలానికి ఎంపీపీ ఎందుకు,నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఎందుకు అని తీవ్రంగా ఆరోపించారు.ఈ విషయంపై ఎంపిడిఓ వివిరణ ఇవ్వాలని కోరగా ఎంపిడిఓ స్పందిస్తూ పెన్షన్లకు సంబంధించిన పూర్తి బాధ్యత సచివాలయ అధికారులదేనని ఏవైనా పెండింగ్ లు ఉంటే తన లాగిన్ లో నుంచి పరిష్కరించబడతాయని 3 నెలల్లోనే పెన్షన్ మంజూరు కావడం పై అధికారులు ద్వారానే జరిగి ఉండవచ్చన్నారు.

పశు వైద్య అధికారిని నియమించండి

విశాలాంధ్ర - కె. కోటపాడు : మండలంలోని చౌడువాడ మేజర్ పంచాయితీ లో గల పశువుల ఆసుపత్రికి పూర్తి కాల వైద్య అధికారిని నియమించాలని చౌడువాడ గ్రామం తో పాటు పరిసర ప్రాంత రైతులు కోరుచున్నారు. ఈ పశు వైద్య ఆసుపత్రికి పూర్తి కాల వైద్యాధికారి లేక పోవడంతో పాడి రైతులు గొర్రెలు మేకల పెంపకం దారులు ఇబ్బంది పడుతున్నారు. మండలానికి అతిపెద్ద గ్రామం తోపాటు ఇక్కడ 80 శాతం మంది రైతులు పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వారితో పాటుగా గొర్రెలు మేకల పెంపకం దారులు కూడా ఈ గ్రామంలో ఎక్కువమంది ఉండడంతో పశువులకు గొర్రెలు మేకలకు అనారోగ్యం సోకినట్లయితే ఆసుపత్రిలో డాక్టర్ లేక ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రి లో అసిస్టెంట్ డాక్టర్ ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఈయనకి పశువులకు గొర్రెలకు మేకలకు వైద్యం చేయడములో అనేక ఇబ్బందులు పడుచున్నారు . దాంతోపాటుగా ఎప్పుడు ఆస్పత్రికి వస్తారు ఎప్పుడు వెళ్తారు ఆయనకే తెలీదు. దీంతో గ్రామంలో పశువుల హాస్పిటల్ ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉంది. చౌడువాడ పంచాయతీ పరిధిలో మల్లం పాలెం, గరుగుబిల్లి. పాచిల వానిపాలెం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలలో అధికంగా పాడిపశువులను పెంచి పోషిస్తున్నారు. గ్రామంలో విశాఖ డైరీ. హెరిటేజ్. డైరీలు ఉన్నాయి. ఈ డైరీలలో మండలంలో ఏ గ్రామంలో లేనన్ని పాలు రైతులు సరఫరా చేస్తున్నారు. మేలు జాతి ఆవులు గేదెలు ఈ పంచాయతీ పరిధిలో రైతులు పెంచుతున్నారు. పశువులకు అనారోగ్యము వచ్చినట్లయితే ప్రైవేటీ పశు వైద్యాధికారులను సంప్రదించాల్సిన అవసరము ఏర్పడుతుంది. దీంతో వారు పసులకు వైద్యం పేరుతో వేల రూపాయలు రైతుల వద్ద నుండి గుంజుతున్నారు. పశువులకు చూడు ఇంజక్షన్. చూడు తనిఖీ మొదలైన వాటికి అధిక రేటు వసూలు చేస్తున్నారు. రైతులు చేసేదిలేక వారు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. కె.కోటపాడులో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారి ఉన్నా ఈ ఆస్పత్రి వైపు కన్నెత్తి చూడటం లేదు. జిల్లా అధికారులు స్పందించి చౌడువాడ పశువుల ఆసుపత్రికి పూర్తి కాల వైద్యాధికారిని నియమించాల్సిందిగా రైతులు కోరుతున్నారు.

ఎడ్ల బండి ఎక్కిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని సత్యవరం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఎడ్ల బండి ఎక్కి అందరిని ఆశ్చర్య పరిచారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పక్కనే ఆగి ఉన్న ఎడ్ల బండిని చూసి ముగ్ధులై దానిపై ఎక్కి ఎడ్లబండిని తోలే ప్రయత్నం చేసి వైసీపీ నాయకులను, అధికారులను ఆకర్షించారు. అంతకుముందు గ్రామంలో ఇటీవల పిడుగు పడి ధ్వంసం అయిన ఇంటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఇసరపు తాతారావు, జగతా శ్రీను, ఎంపీటీసీలు కలిదిండి సతీష్‌రాజు, కొంతం నరేష్, సర్పంచ్ సఖిలేటి రాము, గూటూరు వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సాంబశివరావు, తహశీల్దార్ జైప్రకాష్ తదితరులున్నారు.

పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తనకు ప్రియ శిష్యుడు

విశాఖ శారదాపీఠాదిపతి స్వరూపానంస్వామి

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ తనకు ఎంతో ఇష్టమైన శిష్యుడని విశాఖ శారదాపీఠాదిపతి శ్రీ స్వరూపానంద స్వామి స్పష్టం చేసారు. భక్తుల సహకారంతో పెందుర్తి వేంకటాద్రిపైకి నూతనంగా ఏర్పాటు చేసిన ఘాట్ రోడ్డును శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఆలయాలు నిర్మించడం పెద్దసమస్య కాదని, వాటి నిర్వాహనే ముఖ్యమైనదని పేర్కొన్నారు. తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం నుండి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం వరకు అన్ని దేవాలయాలు శ్రీ విశాఖ శారదాపీఠానికి అను భంధంగా ఉన్నప్పటికీ పెందుర్తి వేంకటాద్రి తమకు మరింత అనుభంధ మైనదని స్వరూపానందేంద్ర స్వామి పేర్కొన్నారు. వేంకటాద్రిపైకి రాత్రి 8 గంటల సమయంలో నడుచుకుంటూ వచ్చి స్వామిని సేవించుకున్నానని వెల్లడించారు. వేంకటాద్రి ఆలయ ప్రదానార్చకులు మోర్తా రామానుజాచార్యులను అదికారులు వేధించడంతో తాను స్వయంగా కలుగచేసుకొని ఆయనకు రక్షణ కల్పించానని తెలిపారు. వేంకటాద్రి ఆలయం నిర్మాణంతో పాటు నిర్వాహణలో కీలకంగా వ్యవహరిస్తున్న రాజును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వరూపానంద, స్వాత్మానందస్వాములను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్, 95 వార్డు కార్పొరేటర్ మమ్మన దేముడు, వైసిపి నాయకులు మెంట్ మహేష్, పిఎసిఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజు ఈవో పాల్గొన్నారు.

చిట్టివలస కోండపేటలో త్రాగు నీటి పైపు పరిశీలన

విశాలాంధ్ర - ఆనందపురం : భీమిలి నియోజకవర్గం చిట్టివలస ప్రాంతం కొండపేటలో భీమిలి ప్రాంతానికి త్రాగు నీరు అందించే పంపు హౌస్ నుండి వచ్చే పైపులైన్ పగిలి రోడ్డు పగిలి గొయ్యి ఏర్పడింది. ఈ గొయ్యిలో మురుగు నీరు చేరి దుర్గంధం రావడం మాత్రమే కాకుండా అందులో పాములు, విష పురుగులు రావడంతో ప్రమాదకరమైన పరిస్థితికి చేరింది. పైపు లైన్ నుండి త్రాగు నీరు బయటికి రావడమే కాకుండా, మరుగుదొడ్ల నుండి గొయ్యిలో చేరిన మురుగు నీరు కూడా ఆ పైపులైన్ లోకి వెళ్లి భీమిలి ప్రాంత ప్రజలకు త్రాగు నీరుతో కలిసి చేరుతుంది. దీని వల్ల భీమిలి ప్రాంత ప్రజలు తీవ్ర అస్వస్థత పాలయ్యే అవకాశం ఉంది అని భీమిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి డా. సందీప్ పంచకర్ల గారు హెచ్చరించారు. దీని పై ఆరు నెలల క్రితం గడప గడపకు కు కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే అవంతి గారికి ప్రజలు తెలిపిన ఇప్పటికీ ప్రయోజనం శూన్యం. ఈరోజు జనసేన పార్టీ తరుపున ఆ ప్రాంతంలో స్థానికులతో కలిసి డా. సందీప్ పంచకర్ల , జనసేన పార్టీ నాయకులు నిరసన తెలిపి, ఆ గొయ్యిను శ్రమదానం చేసి మట్టితో పూడ్చే ప్రక్రియ చేపట్టారు. సమస్య వస్తే తాత్కాలిక పనులు కాకుండా కొత్త పిపులైన్ వెయ్యాలని జనసేన పార్టీ తరపున సందీప్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్ర రావు, శ్రీను బాబు, పరిమి భువనేశ్వరీ, సతీష్, లక్ష్మి, రాజు, దివాకర్, శంకర్ రెడ్డి, ప్రీతం, వెంకట్, స్వరాజ్, వాసు, సురేష్, నానాజీ, శివా మరియు జనసైనికులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి

విశాలాంధ్ర - మల్కాపురం : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలని 61 వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి కొణతాల సుధ అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో బాలలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో శనివారం ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ- ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల్లో ఎవరికి ఏ సహాయం కావాలన్నా తనను సంప్రదించవచ్చని, తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని ఆమె అన్నారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న వై.ఎస్.ఆర్.సి.పి. 61 వ వార్డు అధ్యక్షులు డిపో సత్యనారాయణ మాట్లాడుతూ - విద్య ద్వారా మాత్రమే ఉన్నత శిఖరాలను చేరగలమని అన్నారు. ప్రతి వ్యక్తికి గౌరవం విద్య ద్వారానే లభిస్తుందని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత కె.సత్తిరాజు మాట్లాడుతూ- విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో కె.రాధ, సి. హెచ్.వి.సత్యనారాయణ, సి. హెచ్. నూకరాజు, బి.అప్పల నాయుడు, పి.స్వప్న, వీర్రాజు, నారాయణ , సతీష్, ప్రముఖ కార్మిక నాయకులు, బి.సత్యానందం మాట్లాడారు. ఈ సమావేశాన్ని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి. ఎస్. భాగ్యలక్ష్మి సమన్వయం చేసి మాట్లాడుతూ- ఈ వేసవి శిక్షణా శిబిరం 40 రోజులు పాటు ఉంటుందని, ఈ రోజు 20వ రోజని అన్నారు. ఈ శిబిరం విజయవంతం కావడానికి సహాయం అందిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ పర్యవేక్షించారు.

చత్తీస్‌ఘడ్‌లో ఎన్కౌంటర్.. ఒక మహిళా మావోయిస్టు గాయాలు

విశాలాంధ్ర - చింతూరు : చత్తీస్గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా లో శనివారం ఉదయం మావోయిస్టులకు పోలీసులకు ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు గాయపడ్డారు. ఇద్దరు బిఎస్ఎఫ్ జవాన్లకు స్వల్ప గాయాలయ్యాయి. కాంకెర్ జిల్లా ఎస్పీ సెలబ్ కుమార్ సింహా కదనం ప్రకారం జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ప్రతాప్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉరపంజూర్ చుట్టుపక్కల అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారని సమాచారం తమకు అందిందని ఈ మేరకు బిఎస్ఎఫ్ బలగాలు, బలగాలు అడవిలోకి కుంబింగ్ వెళ్లారని తెలిపారు. పోలీసులను చూసిన పొంచి వున్న మావోయిస్టులకు పోలీస్ లకు సుమారు అర గంట కాల్పులు జరిపారనీ ఈ కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్ట్ కాలికి గాయమైంది నీ , గాయపడ్డ మావోయిస్టు ను అంబులెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆమె 5 ఐదు లక్షల రివార్డు జరిగిన మదనవాడ-కొడై కుర్సి సంయుక్త ఎల్ వో ఎస్ కమాండర్ ఫగ్ని పోడియం భార్య అని తెలిపారు. ఇదే ఘటనలో ఇద్దరు బిఎస్ఎఫ్ జవాన్లకు స్వల్ప గాయాలు అయ్యాయని యస్ పి తెలిపారు.వీరిని మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోనీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారనీ తెలిపారు. సంఘటన స్థలంలో సింగల్ షాట్ రైఫిల్.1, ఐఈ డి ఆరు బాంబులు, సోలార్ ప్లేట్.1, విప్లవ సాహిత్యం, మందులు, కరపత్రాలు, ఇతర సామాగ్రి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సంఘటన అనంతరం ఉరుపంజూర్ అడవి ప్రాంతంలో తప్పించుకున్న మావోయిస్టుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

సిడిఎంఏ, జిల్లా ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిడిఎంఏ, విశాఖ జిల్లా ప్రత్యేక అధికారి పి.కోటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన 4వ జోన్, 34వ వార్డు కొబ్బరితోట వద్ద పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మతో కలిసి సందర్శించారు. అర్బన్ హెల్త సెంటర్‌లో గల మౌలిక వసతుల వివరాలను డిఏంఓహెచ్ ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి ప్రతి రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారని, పడకలు ఎన్ని ఉన్నాయని, మందుల వివరాలు, చికిత్స అందించే విధానం, ఎంతమంది వైద్యులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో తాగునీటి కొరకు ఆర్ ఓ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 33వ వార్డు వెంకటేశ్వర మెట్ట సచివాలయం నెంబర్ 218ని సందర్శించి కార్యదర్శుల హాజరు, మూమెంట్ రిజిస్టర్, డైరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను స్థాపించి ప్రజలకు దగ్గరగా సేవలు అందిస్తున్నారని, అటువంటి సచివాలయ వ్యవస్థను నిర్వర్యం చేయకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ సచివాలయ పరిధిలో ఎంత మంది వాలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారని, వాలంటీర్ల పోస్టులు ఏమైనా ఖాళీలు ఉన్నాయా అని ఆరా తీశారు. సర్వీస్ రిక్వెస్టు ఆలసత్వం వహించకుండా నిర్ణీత సమయానికే పరిష్కరించాలని, ప్రతి నెల వృద్ధులకు పింఛన్ ఇచ్చే విధానం, డోర్ టు డోర్ చెత్త సేకరించే విధానం, సర్వీస్ ఛార్జీలు వివరాలను కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో అదనపు కమిషనర్లు వై శ్రీనివాసరావు, వర్మ, డాక్టర్ వి సన్యాసిరావు, డిఏంఓహెచ్ జగదీశ్వరరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంఓహెచ్ డాక్టర్ ఎన్ కిషోర్, డీపీఓ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

VMRDA
విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ
పత్రికా ప్రకటన
Online No. 1167/0019/LP/VMRDA/2023, తేది. 24-05-2023
ఇందుమూలముగా యావన్మందికి తెలియ చేయునదేమనగా M/s J.K. Estates వారు, విశాఖపట్నం జిల్లా, మునగపాక మండలం, నాగవరం గ్రామం నందలి సర్వే సంఖ్యలు 343/2, 3, 4, 5, 6, 7p, 8p, 9p, 10p & 344/7pలో ఎకరములు 2.1914 సెంట్లు గల భూమిని లేఔట్ నిమిత్తము దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఫైల్ ఆన్‌లైన్ నెం.1167/0019/LP/VMRDA/2023 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.
కావున పైన తెలిపిన లే అవుట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగియున్న యెడల ఈ ప్రకటన జారీచేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.
సం/- మెట్రోపాలిటన్ కమీషనర్, వి.ఎం.ఆర్.డి.ఏ

301 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ప్రతిపాదనలకు ఆమోదం

కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జిల్లాలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహించుచున్న 301 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ ప్రతిపాదనలను ఆమోదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డా.ఎ.మల్లిఖార్జున తెలిపారు. కలెక్టర్ ఛాంబర్ లో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ , చైర్మన్ డి ఎం ఎ సి, అధ్యక్షతన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సంబంధించిన విషయాలను చర్చించడం జరిగిందని, అందులో భాగంగా త్వరలో అక్రిడిటేడ్ జర్నలిస్టులకు వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి చర్యలు చేపట్టవలసినదిగా వై.ఎస్.ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్, జిల్లా కో ఆర్డినేటర్ డా.రాజేష్ ను ఆదేశించారు. ఇప్పటి వరకు ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తు చేయని జర్నలిస్టులు ప్రభుత్వ ఉత్తర్వులు 38, తేది 30-3-2023 ననుసరించి ధరఖాస్తు చేసుకొని సదరు ధరఖాస్తులను జిల్లా పౌర సంబంధాల కార్యాలయానికి అందజేయాలని అన్నారు. అంతకుముందు జిల్లాలో నూతనంగా ఏర్పాటు కాబడిన కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మెన్ వారికి పుష్పగుచ్ఛం అందజేసారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కె.రాఘువేంద్రరెడ్డి, ఎన్.ఎస్.ఆర్.కె. బాబురావు, ఎమ్ .చిట్టిబాబు, ఎస్.అనురాధ, డి.రాణి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీమతి ఎస్.మోహనలక్ష్మీ, వై.ఎస్.ఆర్.ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ కె.వి.వి.ఎస్.ఎన్ రాజేష్ , ఆర్.టి.సి డిప్యూటి సి.టి.ఎమ్ జి.సత్యన్నారాయణ, కన్వీనర్, సభ్యులు వి.మణిరామ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి

విశాలాంధ్ర - కొయ్యూరు : కేంద్రప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ నేతలు కార్యకర్తలపై ఉందని భాజపా పాడేరు నియోజకవర్గ కన్వీనర్ కూడా కృష్ణారావు పేర్కొన్నారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనపైపార్టీ మండల అధ్యక్షుడు మురుకుర్తి అప్పలరాజు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కూడా కృష్ణారావు మాట్లాడుతూ కేంద్రంలో 9 ఏళ్ళ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలందరికీ తెలియజేసి అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి గిరిజన ప్రాంత అభివృద్ధికి కేంద్రం విశేషంగా నిధులు మంజూరు చేసి విడుదల చేస్తుందని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో సైతం కేంద్రం రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేసి ప్రజలను ఆదుకుందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న పలు పథకాలకు రాష్ట్ర ప్రభుత్వాలు పేర్లు మార్చి తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నాయన్నారు. ఉపాధి హామీ పథకం గిరిజన మ్యూజియంతో పాటు వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు మంజూరు చేస్తుందని వాటన్నింటినీ ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలు నేతలపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాజాపా పాడేరు సోషల్ మీడియా కన్వీనర్ పండా ఈశ్వరరావు, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రరావు, ఎస్టి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు, కొయ్యూరు మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు మంగతల్లి మండల కార్యదర్శి అచ్యుతవాణి ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ దేవుడు సత్యవతి తదితర పలువురు పాల్గొన్నారు.

సమస్యలు సాధించే వరకు పోరాటమే శరణ్యం

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే సార్వత్రిక సమ్మెకు వెనుకాడబోమని ఉద్యోగ సంఘాల నేతలు హెచ్చరించారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ ఆందోళనకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆస్కారావు మాట్లాడుతూ ఉద్యోగుల హామీలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి మాట తప్పారని మండిపడ్డారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కేశారని, జిపిఎఫ్ సొమ్మును దొంగిలించారని, వాడుకొని జిపిఎఫ్ కి వడ్డీలు కడుతున్నామన్నారు. ఇదేమి ప్రభుత్వం ఇదేమి పాలన. అంటూ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పై సీఎం నోరు విపడం లేదన్నారు. తక్షణమే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, జిపిఎఫ్ ఖాతాలో సొమ్ము జమ చేయాలని, డిఏలను వెంటనే విడుదల చేయాలని, డిఏలు పెండింగ్ పెట్టకుండా ఇవ్వాలని, ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు అక్టోబర్ 31 వరకు కొనసాగిస్తాం అన్నారు. అప్పటికి ప్రభుత్వం దిది రాకపోతే పోరాటానికి సిద్ధమవుతాం అన్నారు. నిరవధిక సమ్మెకు దిగుతాం అని హెచ్చరించారు. నవంబర్ నెల నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తాం అని, 160 ఉద్యోగ సంఘాల సమస్యలు ముఖ్య మంత్రి దృష్టిలో ఉన్నాయన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టి సారించాలన్నారు. జీతం కోసం ఎదురుచూసే పరిస్థితిలో ఉద్యోగులు దిగజారడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమ వారి భద్రతపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు కుసుమంచి కృష్ణాజి, వివిధ శాఖల గ్రూప్ వన్ అధికారుల నుంచి నాలుగో తరగతి ఉద్యోగుల వరకు పాల్గొన్నారు.

గొల్లవిల్లివాని పాలెంలో పర్యటించిన కార్పోరేటర్ ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు, గొల్లవిల్లివానిపాలెం, శివారు సాయిసౌదా నగర్ ప్రాంతంలో స్థానిక కార్పోరేటర్ ముమ్మన దేముడు శనివారం పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీధి దీపాలు, రోడ్లు, కాలువలు ఏర్పాటు, తాగునీరు సరఫరా, పార్కు పరిసరాలు శుభ్రం చేయాలని ప్రజలు కోరగా సానుకూలంగా స్పందించిన ముమ్మన సంభదిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యలు పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలని వాసులు, వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన సంతోష్,డ మంగమ్మ ఆర్పీ కనకమహాలక్ష్మి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా 108 అంబులెన్స్

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : మండలంలోని వ్యాదిగ్రస్తులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు గాను గతంలో ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ లను రిపేర్ చేయకపోవడంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మూలన పడి ఉన్నాయి. వాటిని బయటకు తరలించి రిపేర్ చేయడంలో నిర్లక్ష్యం చేస్తుండటంతో ప్రస్తుతం అవి మూలనపడి పూర్తిగా శిధిలవస్తలో చేరుతున్నాయి. లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన వాహనాలను సకాలంలో మరమత్తు చేయకపోవడంతో పూర్తిగా వృధా అవుతున్నాయని స్థానికులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతుకు గురై మూలన చేరిన వాహనాలను రిపేర్ చేసి అందుబాటులో తీసుకొచ్చి గిరిజనులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని మండల గిరిజనులు కోరుతున్నారు.

టయోటా కిర్లోస్కర్ ఎక్స్ పెడిషన్' యొక్క మొదటి జోనల్ డ్రైవ్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ : టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికేయం) దేశవ్యాప్తంగా మోటారు ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న , అసాధారణమైన మూడు రోజుల సాహసయాత్రకు నాంది పలుకుతూ ఈరోజు 'గ్రేట్ 4 ఎక్స్4 ఎక్స్-పెడిషన్' ను ప్రారంభించింది.

ఈ థ్రిల్లింగ్ డ్రైవ్ ప్రధాన లక్ష్యం అసమానమైన ఆఫ్-రోడింగ్ అనుభవం ద్వారా అభిమానులను ఆకర్షించడం వారితో మమేకం కావడం , వారిని సాధారణతకు మించి వెళ్లేలా ప్రోత్సహించడం, వారిలో సాహస స్ఫూర్తిని రగిలించడం టయోటాతో ఈ ఉత్తేజకరమైన ప్రయాణం ద్వారా శాశ్వత జ్ఞాపకాలను సృష్టించడం లక్ష్యంగా సాగుతుందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. ఈ కార్యక్రమం లో పాల్గొనే 4 ఎక్స్4 కమ్యూనిటీకి "మాస్ హ్యాపీనెస్" అందించడానికి సిద్ధంగా ఉందనీ, టయోటా ఈ గ్రేట్ 4 ఎక్స్4 ఎక్స్ పెడిషన్ ను బెంగళూరు నుండి ప్రారంభించిందన్నారు. దక్షిణ భారతదేశం నుండి 4 ఎక్స్4 ఔత్సాహికుల దీనిలో పాల్గొన్నారన్నారు. ఈ ఎక్స్ పెడిషన్‌లో అంతర్భాగంగా టికేయం ఒక అదనపు 4 డబ్లు డీ ట్రాక్‌ని సృష్టించిందనీ, దీనిలో సహజసిద్ధమైన ఆర్టిక్యులేషన్, సైడ్ ఇంక్లైన్‌లు, రాంబ్లర్, డీప్ డిచ్‌లు, స్లష్, రాకీ బెడ్‌లు మరియు మరెన్నో సహజమైన అడ్డంకులను సైతం దాటుకుని, గతంలో మరెవ్వరూ అందించని విధంగా అత్యున్నత ఆఫ్ రోడింగ్ అనుభవాన్ని అందిస్తుందని చెప్పారు.

అభయ హస్తం పథకానికి 22 మంది ఎంపిక : సర్పంచ్ కుమారి



విశాలాంధ్ర - రావికమతం : మండలంలో గల కవగుంట గ్రామపంచాయతీలో అభయ హస్తం పెన్షన్కు సుమారు 22 మంది ఎంపిక అయినట్లు సర్పంచ్ దాసరి కుమారి వరహాలు అన్నారు. మండలంలో కవగుంట గ్రామపంచాయతీ లో అభయహస్తం కట్టుకున్న డ్వాక్రా మహిళలందరితో శనివారం సర్పంచ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డ్వాక్రా అక్కచెల్లెమ్మలందరిని లక్ష అధికారులును చేయాలన్న ఉద్దేశంతో అలాగే పెన్షన్లు కూడా డ్వాక్రా మహిళలకు అందించాలన్న లక్ష్యంతో అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకంలో 60 సంవత్సరాలు నిండిన మహిళలకు 500 రూపాయలు ప్రతినెల పెన్షన్ అందించే సౌలభ్యం కల్పించారన్నారు. అయితే ఈ పథకం గత ప్రభుత్వంలో పూర్తిగా మరుగున పడడంతో అభయ హస్తం పెన్షన్ లబ్ధిదారులందరూ దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. అయితే రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాన్ని వారి తనయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన తండ్రి ఏ లక్ష్యంతో అయితే ఈ పథకాన్ని ప్రవేశపెట్టాడో ఆ దిశగా అడుగులు వేయాలన్న ఉద్దేశంతో అభయ హస్తం కట్టి 60 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి 500 పెన్షన్ ఇవ్వడం, అలాగే మధ్యలో ఆగిపోయిన వారికి తిరిగి పెన్షన్ ఇవ్వాలన్న నిబంధన ప్రభుత్వం తీసుకురావడంతో ఆ దిశగా అనేకమంది పెన్షన్ పొందే అవకాశం ఉందన్నారు. అలాగే కవగుంట గ్రామపంచాయతీలో 23 డ్వాక్రా సంఘాలకు గాను సుమారు పది సంఘాలు లో సుమారు 120 మంది చేరడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటికే ఆరుగురు అభయహస్తం పెన్షన్ పొందుతూ ఉన్నారు .దీంతో ప్రస్తుతం ఈ పదకానికి అర్హత పొందిన లబ్ధిదారులు జగ్గపు పైడితల్లమ్మ, బిళ్ళపాటి రత్నం, బర్నికానా అప్పలకొండ, తురాయి రాజమ్మ, రబ్బా సత్యమమ్మ ,సిద్ధ దేవుడమ్మ, నడిపెల్లి కాంతమ్మ, చంద్రాన పార్వతమ్మ, చీపురుపల్లి నాగరాజు, పల్లా రాజమ్మ, చీపురుపల్లి నాగరాజు, తదితర సుమారు 22 మంది ఈ పథకంలో పెన్షన్కు అర్హత కలిగి ఉన్నారన్నారు. వీరు సామాజిక వృద్ధాప్య, వితంతు, వికలాంగ, పెన్షన్లు పొందుతున్నప్పటికీ వీటితో పాటు అభయ హస్తం పెన్షన్ కూడా 500 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇవన్నీ చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వీరందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇది ఇలా ఉండగా అభయహస్తం పెన్షన్ ప్రీమియం కొనసాగించు కోవడానికి ఇష్టం లేనివారు తిరిగి ఆ సొమ్మును తీసుకునే సౌలభ్యం కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనికి సంబంధించి వెలుగు కార్యాలయ సిబ్బందికి ప్రతి గ్రామంలోనూ సర్వే నిర్వహించి అర్హత కలిగిన పెన్షన్ దారులు అందరికీ పెన్షన్ ఇవ్వాలని, ఈ పథకంలో కొనసాగ డానికి ఇష్టం లేని వారందరికి తిరిగి సొమ్ము చెల్లించాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో చాలా దూర దృష్టితో ఆలోచన చేసి డ్వాక్రా అక్క చెల్లెమ్మలను మోసం చేయడానికి వీలులేదని తండ్రి పెట్టిన పథకాన్ని సైతం కొనసాగించాలని వారందరికీ పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం ఎంతో ఆనంద దాయకమన్నారు. దీనికి అధికార యంత్రాంగం కూడా పారదర్శకంగా పెంక్షన్కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ కల్పించాలని దానికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి పంపాలని తెలిపారు. ఈ పథకాన్ని లబ్ధి దారులందరూ సక్రమమైన పద్ధతిలో సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

మహానాడుకు బయలుదేరిన 75వ వార్డు నాయకులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : ఈ రోజు - రేపు రాజమండ్రిలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి 75వ వార్డు నుండి వార్డు కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మీబాయి పిలుపు మేరకు బయలుదేరిన 75వ వార్డు నాయకులు - కార్యకర్తలు వారి వాహనశ్రేణిని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భములో మాట్లాడిన ఆయన తెలుగుదేశం పార్టీ జనప్రబంజనం వైఎస్ఆర్సీపీ వెన్నులో వణుకు పుట్టిస్తుంది అని దీనిని ఎలాగైనా ఆపాలని శతవిధాల ప్రయత్నించినా వారి వల్ల కాదని 28వ తేదీన జరిగే సభతో వైఎస్ఆర్సీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభం అని అన్నారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి అప్పారావు,సుదుమల్ల ప్రసాద్, కాకినాడ అప్పల రాజు, పులి అప్పలరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : రాజమహేంద్రవరం లో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహా నాడు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అన్ని గ్రామాల నుండి నాయకులు కార్యకర్తలు భారీస్థాయిలో రామానాయుడు నాయకత్వం వర్ధిల్లాలి చంద్రబాబు నాయుడు జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ వివిధ వాహనాలలో తరలి వెళ్లారు.

జగనన్న కాలనీలను ఎంపీడీఓ పరిశీలన

విశాలాంధ్ర - మాకవరపాలెం : శనివారం గిడుతూరు జగనన్న కోలనీని ఎంపీడీఓ అరుణశ్రీ సందర్శిచారు. హౌసింగ్ అధికారులకు ఇళ్ళు నిర్మాణం వేగవంతం చేసి త్వరగా నూరు శాతం పూర్తిచేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. స్థానిక అంగన్వాడీ 3 నెంబర్ సెంటర్‌ని సందర్శించి అంగన్వాడీ టీచర్‌కి సిబ్బందికి పలు సూచనలు అరుణశ్రీ సూచించారు.

మహానాడుకి తరలిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - పరవాడ : రాజమండ్రిలో జరగబోయే మహానాడుకు పరవాడ నుండి టీడీపీ నేతలు శనివారం బయలుదేరి వెళ్లారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న అధ్యక్షతన పార్టీ నాయకులు బొండా తాతారావు, సారిపల్లి జోగినాయుడు, కదిలిండి రామకృష్ణరాజు, కూంద్రపు శ్రీనివాస్, పైలా వరలక్ష్మి, పైలా అప్పలనాయుడు, పైలా కుమారి, జాజుల చిన్నారావు, గుండా వెంకటేష్, శివలంక గౌతమ్, మువ్వల సింహాచలం, నంబారి రమణ, గౌరుసు అప్పలరాజు, మొల్లి బాలాజీ తదితరులు తరలి వెళ్లారు.

29న వాలంటీర్లకు వందనం

ఎంపీడీవో మేరీ రోజ్

విశాలాంధ్ర - కొయ్యూరు : ఈ నెల 27 సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో మేరీరోజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ముఖ్య అతిథులుగా హాజరై ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికైన వాలంటీర్లను సన్మానిస్తారన్నారు. సేవ పురస్కారాలకు ఎంపిక చేయబడిన వాలంటీర్లకు పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ జడ్పిటిసి లతోపాటు వైస్ ఎంపీపీలు సర్పంచులు ఎంపీటీసీలు పిఎసిఎస్ చైర్మన్ ఏఎంసీ చైర్ పర్సన్ వివిధ నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్న అభ్యర్థులు ప్రజాప్రతినిధులు విధిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

గ్రంథాలయంలో కథల పోటీలు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : మండల కేంద్రంలోని స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ కార్య క్రమంలో భాగంగా శని వారం చిన్నారులకు కథల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొని వివిధ రకాల కథల పుస్తకాలను చదివి పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే.సుబ్బారావు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో ఆక్రమణలను తొలగించండి

జీవీఎంసీ కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర- మధురవాడ : మధురవాడ పరిసర ప్రాంతాలలోని ఆక్రమణలను తొలగించాలని జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం అయిన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మధురవాడ ప్రధాన రహదారులు, చంద్రంపాలెం, దుర్గా నగర్, మిథిలాపూర్ కాలనీ, మారికవలస, నగర పాలెం, కొమ్మాది జంక్షన్, బోయపాలెం తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధురవాడ, మిథిలాపూర్ కాలనీ పరిసర ప్రాంతాలలో ఆక్రమణలు అధికంగా ఉన్నాయని వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. రోడ్లు, కాలువలు శుభ్రం చేసినప్పటికీ వాటి చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించడం లేదని, వాటిని వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ప్రధాన గెడ్డలోని పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని, వర్షపు నీటికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వీధులలో ప్లాస్టిక్ అధికంగా కనిపిస్తుందని ప్లాస్టిక్ నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి వాటి నిర్మలనకు కృషి చేయాలని అన్నారు.

సబ్సిడీ విత్తనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మేలు రకమైన సబ్సిడీ విత్తనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూకురు పంచాయతీ సర్పంచ్ దంససాని సత్యవతి అన్నారు. శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో 90 శాతం సబ్సిడీతో ఆర్ జి ఎల్ 2537 రకం ధాన్యం విత్తనా లను సర్పంచ్ చేతులు మీదుగా పం పిణీచేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి విత్తనాలు కొను గోలు చేసి రైతులకు ఒక ధాన్యం బస్తతో పాటు వరి తెగులు రాకుండా సూడోమోనస్ 500 గ్రాములు కూడా ఇస్తు న్నట్లు తెలిపారు. మొదటి దఫలో సూకురు, తాడిపుట్టు, కొట్నా పల్లి గ్రామపంచాయతీలకు కలిపి 250 బస్తాలు ధాన్యం సుకూరు రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉం దని ఆమె తెలిపారు.ఈఅవకా శాన్ని రైతులు సద్వి నియోగం చేసు కోవాలని ఆమె కోరారు. ఈకార్యక్ర మంలో స్థానిక వైసీపీ నాయకులు ధనసాని మురళి, పోతురాజు, చిన్నేశ్వరావు,వెంకటేశ్వర్లు.సచివాలయం ఆర్టికల్చర్ అసిస్టెంట్ కృష,అగ్రికల్చ ర్ అసిస్టెంట్ జ్యోతి, మహిళ పోలీస్ కళావతి,వార్డ్ మెంబర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలి వెళ్లిన విశాఖ టీడీపీ నేతలు..

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : తెలుగుదేశం పార్టీ మహానాడు రాజమండ్రిలో రెండు రోజులపాటు జరగనున్న వేడుకకు విశాఖ జిల్లా నుంచి టిడిపి నేతలు అంతా తరలి వెళ్లారు. శనివారం ప్రారంభమైన మహానాడులో విశాఖ టీడీపీ నేతలు అధినేత చంద్రబాబును, యువనేత లోకేష్ ను కలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహానాడులో విశాఖ జిల్లా నేతలు గళం విప్పారు. రాజధాని పేరిట విశాఖలో జరిగిన భూ దందాలు, భూ ఆక్రమణలపై జగన్ సర్కార్ పై నిప్పులు చేరిగారు. విశాఖ అభివృద్ధిని అడ్డుకున్న ది జగన్ సర్కారేనన్నారు. కేవలం మూడు రాజధానుల పేరుతో విశాఖలో విలువైన భూములను జగన్ అంచలంతా దోచేసారని నేతలు మహానాడులో మండిపడ్డారు. విశాఖ పార్లమెంటరీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, గణబాబు, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, మాజీ మంత్రులు బండారు సత్యనారాయణ మూర్తి, అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యేలు నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చీటింగ్ చేస్తే కఠిన చర్యలు : ఎస్ఐ ఉపేంద్ర

విశాలాంధ్ర - గొలుగొండ : గొలుగొండ మండలం గాదంపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ సామిరెడ్డి వెంకటరమణ చోద్యం హై స్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న సమయంలో నాడు నేడు పనులలో అవకతవకులు జరిగాయని చెప్పి చోద్యం గ్రామానికి చెందిన నాతిరెడ్డి వెంకటరమణ (వైస్ సర్పంచ్) అనే వ్యక్తి ఫోన్ చేసి రెండు లక్షల రూపాయలు ఇవ్వమని బెదిరించగా భయపడి లక్షా పదివేల రూపాయలు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. మిగిలిన డబ్బులను కూడా ఇవ్వమని ముద్దాయి బెదిరించడంతో ఫిర్యాదు పోలీసు వారికి ఆశ్రయించగా కేడీపేట పోలీసులు సదర విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ సమయంలో నాతిరెడ్డి వెంకటరమణ ఢిల్లీలో ఉండడం వలన సదర కేసు దర్యాప్తులో ఉందని విషయాన్ని తెలుసుకున్న ముద్దాయి ముందస్తు బెయిల్ నిమిత్తం హైకోర్టును ఆశ్రయించగా సదర్ కోర్టు 41 ఏ సి ఆర్ పి సి నోటీసును అమలు పరచమని ఆదేశించగా 26 5 2003 సదరు ముద్దాయి అయినా నాతిరెడ్డి వెంకటరమణ 41 ఏ సి ఆర్ పి సి నోటీసును అమలుపరిచామని కావున బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నాథ్ రెడ్డి వెంకటరమణ నుండి జాగ్రత్తగా ఉండాలని అదేవిధంగా బెదిరించి ఎవరినైనా డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారాన్ని తెలియజేయవలసిందిగా ఎస్సై కోరారు గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగిన తక్షణమే 9440 90 4240 గల నెంబర్ కు వెంటనే సంప్రదించాలని అలాగే వేసవి కాలం దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామంలో కొత్తవారు ఎవరైనా తిరుగుతున్నట్లయితే వెంటనే పైన తెలపబడి నంబరుకు సమాచారం అందించాలనికె.డిపేట ఎస్సై ఉపేంద్రతెలిపారు.

తెదేపా 'మహానాడు'కు తరలిరండి : మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

విశాలాంధ్ర - కొయ్యూరు : ఈనెల 27 28 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే మహానాడు కార్యక్రమానికి మండల పార్టీ నేతల అభిమానులు భారీగా తరలి రావాలని తెదేపా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొలిసింగి సత్యనారాయణ తోట దొరబాబు కోరారు. ఈనెల 27 28 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి మండల తెదేపా నేతలు భారీగా తరలి వెళ్లారు. ఈ సమావేశానికి పాడేరు నియోజకవర్గం మహిళా కార్యదర్శి రత్నం సీనియర్ తెదేపా నేతలు వరహాల బాబు పుల్లయ్య సన్యాసిరావు కృష్ణ జోగారావు అప్పారావు తో పాటు పలువురు నేతలు కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ దొరబాబులు మాట్లాడుతూ వైసిపి నాలుగేళ్ల పాలనలో ప్రజానీకం అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. రానున్నది తెదేపా ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఈనెల 27, 28 రెండు రోజులపాటు రాజమహేంద్రవరంలో తెదేపా అధినాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహానాడు కార్యక్రమం జరుగుతోందని ఈ కార్యక్రమానికి మండల తెదేపా కుటుంబ సభ్యులంతా హాజరు కావాలని వారు కోరారు.

క్రిమి తరహా వ్యాధులపై సీఎస్ఐఆర్, ఐజీఐబీ లైజాల్ అధ్యయనం

విశాలాంధ్ర - విశాఖ సిటీ : భారతదేశపు ఇళ్లల్లో క్రిములు, క్రిమికారకల ఉనికిని విశ్లేషించడానికి లైజాల్, భారతదేశపు ప్రసిద్ధి చెందిన డిస్ ఇన్ఫెక్టెంట్ బ్రాండ్, భారతదేశంలో ప్రముఖ ప్రభుత్వ పరిశోధనా ఏజెన్సీ, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) సంస్థ 'ఇన్ స్టిట్యూట్ ఆఫ్ జీనోమిక్స్ ఇంటిగ్రేటివ్ బయోలజీ' (ఐజీఐబీ) లు ఉమ్మడిగా ఒక అధ్యయనం నిర్వహించాయి. పరిశోధనా బృందం భారతదేశపు కుటుంబాలలో క్రిములు ఉండటం అధ్యయనం చేసాయనీ సీఎస్ఐఆర్ ఐజీఐబీలో ప్రధాన సైంటిస్ట్ డాక్టర్ రాకేష్ శర్మ, రెకిట్ రీజనల్ మార్కెటింగ్ డైరక్టర్ సౌరభ్ జైన్ చెప్పారు. వివిధ గదులలో నేల ప్రాంతాలు అనారోగ్యాన్ని కలిగించే క్రిములైన ఎసిరీషియా కోలి, మోరాక్సెల్లా ఎస్పీపీ, బ్రివుండిమోనాస్ ఎస్పీపీ, అసినిటోబ్యాక్టర్ ఎస్పీపీ వంటి క్రిములకు ఆశ్రయంగా ఉన్నాయని కనుగొన్నారన్నారు. మన ఇళ్ల ఉపరితలాల్లో 1000కి పైగా రకాల బ్యాక్టీరియా 200 రకాల వైరస్ లు ఉన్నాయని కూడా పరిశోధన వెల్లడించిందన్నారు. అతిసారం వంటి వ్యాధులకు చర్మం పై ఇన్ఫెక్షన్స్, మూత్రకోశం ఇన్ఫెక్షన్స్, మొటిమలు, కళ్లు రక్త ప్రవాహం ఇన్ఫెక్షన్స్ వంటి వ్యాధులకు ఈ గుర్తించబడిన క్రిములే కారణమన్నారు. 130 సంవత్సరాల అంతర్జాతీయ వారసత్వంతో లైజాల్, ప్రముఖ డిస్ ఇన్ఫెక్టెంట్ బ్రాండ్ కుటుంబాలను కాపాడి వారిని అనారోగ్యరహితంగా ఉంచడంలో ప్రముఖ బాధ్యతవహిస్తోందనీ చెప్పారు.

మూగజీవాల మృత్యు ఘోష

అంతుచిక్కని వ్యాధులతో మృత్యువాత పడుతున్న గోవులు

విశాలాంధ్ర - చింతపల్లి : అంతుచిక్కని వ్యాధులతో మూగజీవాలు (గోవులు) మృత్యు వాత పడుతున్నాయి. గోవుల పెంపకం దారులు వాటి ఆలనా, పాలనా చూడకుండా, కనీసం కట్టి మేవకుండా విచ్చలవిడిగా వదిలి వేయడంతో పచ్చిక దొరకని పరిస్థితులలో గ్రామంలో తిరుగుతూ దొరికిన కూర గాయాలు, గోడ పత్రికలు, కవర్ల తో కూడిన తిండి పదార్థాలు తింటూ పలు రుగ్మతలకు గురౌతున్నాయి. కవర్లు తిన్న కారణంగా అవి అరగక పొట్ట ఉబ్బరించి మృత్యు వాత పడుతున్నాయి. దీనికి తోడు ప్రస్తుతం లంపిస్కిన్ వ్యాధి సోకి గోవులన్నీ మచ్చలతో కూడిన పుండ్లు ఏర్పడి వ్యాధి తీవ్రత కారణంగా నీరసించి మృత్యు ఒడికి చేరుతున్నాయి. ఇప్పటికైనా పశువుల యజమానులు స్పందించి గోవులను విచ్చలవిడిగా విడిచి పెట్టకుండా కట్టి మేపుకోవాలని, అదే క్రమంలో వాటి ఆలనా, పాలనా విషయంలో పశువుల యజమానులు భాధ్యత వహించాలని అధికారులు, పంచాయతీ పాలక మండలి కోరుతుంది. విచ్చలవిడిగా రోడ్లపై తిరిగే పశువుల విషయంలో వాటి యాజమానుల పట్ల కటినంగా వ్యవహరించక తప్పదని ఈఓపీఆర్‌డి కొరుప్రోలు శ్రీనివాస్, సర్పంచ్ దురియా పుష్పలతలు అన్నారు.

తెలుగుదేశం పార్టీలో మరోసారి బయట పడ్డ వర్గ విభేదాలు

ఇప్పటికే ఇద్దరు సస్పెండ్

విశాలాంధ్ర - పాయకరావుపేట : పాయకరావుపేట మండలంలో తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు మరో సారి బయట పడ్డాయి. ఇప్పటికే పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని, నియోజవకర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని పాయకరావుపేటకు చెందిన మాజీ వైఎస్ ఎంపిపి గొర్లె రాజబాబు, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణ రావులను పార్టీ నుండి సస్పెండ్ చేశారు. వీరిద్దరిని సస్పెండ్ చేసినా వీరితోపాటు మరి కొంతమంది టీడీపీ నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును పాయకరావుపేటలో కలిసారు. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడుకు పాయకరావుపేట మండలం నుండి రెండు వర్గాలుగా బయలు దేరి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో కొంతమంది నాయకులు 13 వాహనాల్లో ఇక్కడ నుండి బయలు దేరి వెళ్లారు. అలాగే పాండురంగస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ళ వరహాలబాబు ఆధ్వర్యంలో మరో వర్గం జాతీయ రహదారి వైజంక్షన్ వద్దకు చేరుకొని అక్కడ నుండి సుమారు 20వాహనాల్లో మహానాడుకు తరలివెళ్లారు. ఏ వర్గానికి వారు ముందుగానే ముఖ్యమైన నాయకులకు ఫోన్‌లో సమాచారాలు అందజేసుకొని ఇక్కడ నుండి తరలివెళ్లారు. కొందరు నాయకులు ఏ వర్గం దగ్గరకు వెళ్లాలో ఆలోచించుకొని తటస్థంగా ఉండి వారి గ్రామం నుండి నేరుగా మహానాడుకు తరలివెళ్లినట్లు తెలిసింది. ఇప్పటి వరకు రెండు వర్గాలు అనుకున్న తెలుగుదేశం పార్టీలో మహానాడు సాక్షిగా మూడు వర్గాలు తయారయ్యారని ఆపార్టీలోని ముఖ్య నాయకులు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సస్పెండ్‌లు, వర్గ విభేదాలు పార్టీకి నష్టాన్ని చేకూరుస్తాయా? లాభాన్ని చేకూరుస్తాయో? వేచి చూడాల్సి ఉంది.

సర్వే నెంబర్ 97,99లపై విచారణ చేపట్టాలి : వైస్ ఎంపీపీ

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్ : యలమంచిలి ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారంనాడు జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సంభందిత శాఖల ఆ ప్రశ్నలపై అవగాహన లేని హాజరైన అధికారుల సమాధానం చెప్పలేక తలమునకలయ్యారు. ఎంపీపీ గోవింద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ రాజానా శేషు మాట్లాడుతూ బయ్యవరం పంచాయతీ జాతీయ రహదారికి 100 మీటర్ల దూరంలో నిర్మిస్తున్న వైశాఖి బయో మెరైన్ అనే పరిశ్రమ యాజ మాన్యం వారు పురుషోత్తపురంకి వరహానది నుండి పులపర్తి ద్వారా తాళ్లమ్మ, బావి చెరువులకు నీళ్లు వచ్చే కెనాల్ ను గత పంచాయతీ ఇచ్చిన తీర్మానంతో పైపులతో కప్పేసి వాళ్లికిష్టమొచ్చినట్లు వాడుకుంటున్నారని దానికి సంబంధించిన విధి విధానాలు ఏమైనా ఉన్నాయా అని నీటిపారుదల శాఖ వారిని ప్రశ్నించారు.ఏదైనా ఒక పరిశ్రమ పెట్టేముందు ప్రజాభిప్రాయ సేకరణ అవసరమనే విషయం కూడా యాజమాన్యానికి తెలియనప్పుడు కనీసం రెవెన్యూ శాఖ అధికారులైన వారికి చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.అదే విధంగా లైన్ కొత్తూరు పంచాయతీ 97,99 సర్వే నెంబర్లలో సుమారు 14 ఎకరాలకు సంబంధించిన భూమిలో ఆ భూ యజమాని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారన్న ఆరోపణలపై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి సర్వే చేసే విధంగా చర్యలు చేపట్టాలని తహశీల్దార్ కు సభ తరుపున చెప్పాలని కోరారు. తదుపరి పులపర్తి ఎంపిటీసి సభ్యులు నూకేశ్వర్రావు మాట్లాడుతూ ప్రస్తుత సమావేశం ప్రారంభమయ్యేముందు గత సమావేశంలో ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై సమా ధానాలు వినిపించాలంటూ గత సమావేశంలో తాను అడిగిన స్త్రీ నిధి సొమ్ముకు సంబంధించిన అవకత వకలపై ఇప్పటికీ సమా ధానం ఇవ్వలేదని వెలుగు విభాగాన్ని ప్రశ్నించారు. దీనిపై వెలుగు ఏపీఎం రాణి మాట్లాడుతూ ఇప్పటివరకు ఏటికొప్పాక లో 6 గ్రూపులకు సంబంధించి రూ.14,80,000లు, పులపర్తి 2లో 11 గ్రూపు లకు సంబంధించి రూ.9,80,000లు రికవరీ చేయిపిం చేశాన న్నారు. ఈ కార ్యక్రమంలో ఎంపిడిఓ జి.ప్రసాదరావు, జెడ్పిటిసి సేనాపతి సంధ్యా రాణి, వైస్ ఎంపిపిలు రాజానా శేషు, ఎస్.ఉమ, సర్పంచ్ లు, ఎంపిటీసీలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, యధావిధిగా సూపర్ సర్పంచ్ లు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టిక ఆహారం తీసుకోవాలి : ఎమ్మెల్యే ఫాల్గుణ

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు : మండలంలో గల కిలగాడ పంచాయతీ పరిధిలోగల పడాల్పుట్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సంపూర్ణ పోషణ సరుకులను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం గర్భిణీ స్త్రీ లకు అవసరమైన పోషకాహారం అందిస్తువారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ అన్నారు. శనివారం మండలంలో గల కిలగాడ పంచాయతీ పడల్ పుట్ అంగన్వాడి కేంద్రంలో సంపూర్ణ పోషణ సరుకులను పంపిణీ కార్యక్రమం ఐసిడిఎస్ అధికారులు నిర్వహించారు. గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమాలు భాగంగా అరకు ఎమ్మెల్యే ఆ గ్రామాన్ని సందర్శించినప్పుడు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సంపూర్ణ పోషణ సరుకులు పంపిణీ చేశారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు చిన్నారులు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సరుకులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు,గ్రామస్థాయిలో ఉండే గర్భిణీ స్త్రీలకు పోషక విలువలుకొరకు ప్రభుత్వం అందించే సంపూర్ణ పోషక సరుగులను గ్రామంలో తల్లులకు న్యూట్రిషన్ పోషక పదార్థాలను అదేవిధంగా చూడాలని ఐసిడిఎస్ సిబ్బందిని ఆదేశించారు,గిరిజన ప్రాంతంలో హిమోగ్లోబిన్ హీనత ఉన్న గర్భిణీ స్త్రీలు అంగన్వాడి సిబ్బంది ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలన్నారు,గ్రామాల్లో ఐసిడిఎస్ సిబ్బంది పర్యటించి పౌష్టిక ఆహార ప్రాముఖ్యతపై మహిళలకు గర్భిణీ స్త్రీలకు వివరించి ప్రతి ఒక్కరిని చైతన్యపరచాలన్నారు,ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ,సర్పంచ్ శివశంకర్, సిడిపిఓ వరహాలమ్మ వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున రావు,అంగన్వాడీ కార్యకర్త సీతమ్మ వైసీపీ నేతలు మూర్తి కొండలరావు తిరుపతిరావు జయదేవ్ రామకృష్ణ బాబురావు సన్యాసిరావు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కిలగాడ పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు : మండలంలో గల కిలగాడ పంచాయతీలో 2 వ రోజు గడవ గడప మన ప్రభుత్వం కార్యక్రమం శనివారము కీలగడ పంచాయతి పరిధిలో గల పడల్పుట్ తడిగేరు కోపరిమామిడి గ్రామంలో రెండవ రోజు 164 గడపలను సందర్శించి గడపగడపకే మన ప్రభుత్వ కార్యక్రమాన్ని అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ నిర్వహించారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా గిరి గ్రాముల అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు,రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గిరిజన ప్రాంతం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఆయన అన్నారు,ప్రతి ఒక్కరికి కులమతలకు అతీతంగా,రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఒకే ఒక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఆయన అన్నారు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ప్రజలకు అడిగి తెలుసుకున్నారు, గతంలో ఉన్న ప్రభుత్వాలు గిరిజన ప్రాంత అభివృద్ధికి ఆటంకంగా మారదంతోనే అభివృద్ధి ఎక్కడ జరగలేదని ఆయన గుర్తు చేశారు,వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆంధ్ర రాష్ట్ర అంతట అభివృద్ధితో ముందుకు కొనసాగుతుందని ఏ గ్రామానికి ఏ సమస్య లున్న తన దృష్టికి నేరుగా తీసుకురావాలని ఆయన ప్రజలకు సూచించారు కొత్తూలబయలు గ్రామంలో త్వరలోనే త్రాగునీరు సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు ఇప్పటికే ఆర్డబ్ల్యూఎస్ ఏఈ తో మాట్లాడి గ్రామానికి చేరుకుని పరిశీలన చేసి త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించానని ఆయన అన్నారు,ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వెలుగు ఏపీఎం ఎస్, దేవమంగ, మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జునరావు వైసిపి నాయకులు జే.వి.ఎస్.ఎన్. మూర్తి పులి రాజు సన్యాసిరావు, కొండలరావు జయదేవ్ వివిధ శాఖల సిబ్బంది,పార్టీ నేతలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భారతీయ జనతాపార్టీ భీమిలి అర్జున్ మండల కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర - భీమిలి : మండల అధ్యక్షులు శ్రీమతి కంటుభుక్త సునీత తెలియజేశారు. ఈ సమావేశంలో భీమిలి నియోజక వర్గం కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని సాంప్రదాయంగా ప్రతి మూడు నెలలకు జరిగే ఈ సమావేశం మనలోని ఐక్యతకు నిదర్శనమని, పార్టీని పోలింగ్ బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని, అందుకు పార్టీలో ప్రతి ఒక్కరు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తిన వెంకటరమణ, నాయకులు, పోలుబోతు విజయ, తీగల ప్రభాకర్ రావు, పాసి అప్పలనాయుడు, చెన్నా రాము, గరికిన రామారావు, భవానీ, పోలిశెట్టి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో అమృత జలధర్

విశాలాంధ్ర - పెదబయలు : అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో అమృత జలధర్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్పీ తుహిన్ సింహ మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గిన్నెలకోట పంచాయతీలో గల చింతగరువు గ్రామం లో పర్యటించి బోర్వెల్ మరియు ట్యాంక్ ఓపెనింగ్ చేసినారు. ఈ సంవత్సరం మార్చి నెలలో చింతగరువు గ్రామస్తులు ఎస్పీ కార్యాలయానికి వెళ్లి వారి ఊరిలో ఉన్న నీటి సమస్య కోసం ఎస్పీ గారికి చెప్పగా, ఎస్పీ గారు స్పందించి ఆ గ్రామానికి పోలీసువారి సహకారంతో అమృత జలధారు కార్యక్రమం ద్వారా బోర్వెల్ ని తవ్వించి ఒక ట్యాంకు నిర్మాణం చేసి సుమారు 100 కుటుంబాలకు నీటి సమస్యను తీర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నీటి సమస్యను ఎస్పీ గారికి ఒక్కసారి చెప్పగానే తీరిపోయిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గారు మాట్లాడుతూ ప్రజలందరూ పోలీసు వారికి సమస్యలు చెప్పుకోవడంలో భయపడకూడదని ఈ అమృత జలజారి కార్యక్రమం ఒక ఆదర్శంగా తీసుకోమని చెప్పినారు. ప్రజలకు ఎల్లప్పుడూ అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు వారు సహకరిస్తూనే ఉంటారని తెలియజేశారు. గంజాయి పంటకు దూరంగా ఉండి సాంప్రదాయ పంటలు వేసుకోవాలని సూచించారు. మావోయిస్టు ప్రభావితానికి దూరంగా ఉండటం వల్లే ఈనాడు చింతగరువులో పోలీసు వారు డెవలప్మెంట్ కార్యక్రమాలు చేయడానికి వీలు పడిందని తెలియజేశారు. అనంతరం ప్రతి ఒక్క గృహానికి స్టీల్ బిందె పంపిణీ చేశారు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు భోజన సౌకర్యం కల్పించారు ఈ కార్యక్రమంలో పాడేరు ఏ ఎస్ పి ధీరజ్ జిమాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ సత్యనారాయణ పెదబయలు ఎస్సై పి మనోజ్ కుమార్, గిన్నెలకోట సూపర్ సర్పంచ్ సాగిన శ్రీను, పెదబయలు పోలీస్ సిబ్బంది మరియు సచివాలయం సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ : లైంగిక వేధింపులకు, బెదిరింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ సమాఖ్య అధ్యక్షుడు, బి.జె.పి. ఎం.పి. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ని పదవి నుండి తొలగించాలని, ఛార్జిషీట్‌తో పాటు న్యాయపరమైన దర్యాప్తు నిర్వహించి, అరెస్టు చేయాలని అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కును కాపాడాలని, భద్రత కల్పించాలని కోరుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు నిర్వహిస్తున్న పోరాటానికి మద్దతుగా శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ కొర్లెల్ల రమాప్రభ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఒలింపిక్స్ లో రెండుసార్లు దేశానికి ప్రాతినిధ్యం వహించి కామన్వెల్త్ గేమ్స్ లో గోల్డ్ మెడల్ సాధించిన పూజారి శైలజ, చెస్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దండు నాగేశ్వరరావు, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్. రాజారావు, ఫుట్ బాల్ కోచ్ నరేష్, కరాటే సెల్ఫ్ డిఫెన్స్ కోచ్ కే. ఇజ్రాయిల్, వైజాగ్ అడ్వెంచర్ అండ్ వాటర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రెహ్మాన్, ఇంటర్నేషనల్ కబడ్డీ ప్లేయర్ జే వి లక్ష్మి, కిక్ బాక్సింగ్ ఛాంపియన్ భవాని, ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ రాష్ట్ర కన్వీనర్ జి.సూర్యప్రభ, ఐద్వా జిల్లా కార్యదర్శి వై సత్యవతి, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ టీచర్ ఎస్‌వి జగదాంబ, వర్కింగ్ విమెన్ జిల్లా కన్వీనర్ ఎం.కామేశ్వరి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.సత్యనారాయణ, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి వై ఎస్ వై శర్మ, ఏపీ బాలల సంఘం కన్వీనర్ రమాప్రభ, విజ్ఞాన కేంద్రం బాధ్యులు జి ఎస్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ జాతీయ స్థాయిలో పతకాలు సాధించి మన దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన మహిళా రెజ్లర్లు 35 రోజులుగా తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఢిల్లీ నడిబొడ్డున జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నా బెల్లం కొట్టిన రాయిలా కేంద్రం ప్రభుత్వం వ్యవహరించడం గర్హనీయమని వక్తలు తమ ప్రసంగాలలో తమ ఆవేదన వెలి బుచ్చారు. మహిళలు తమకు అన్యాయం జరిగిందని బయటకు వచ్చి బహిరంగంగా తెలిపే ఘటనలే తక్కువ కాగా అలా ముందుకు వచ్చిన వాళ్లకు దన్నుగా నిలబడకుండా, లైంగిక వేధింపులకు ఒడిగట్టిన బ్రిజ్ భూషణ్ సింగ్ కు దన్నుగా ప్రభుత్వం నిలవడం సిగ్గు చేటని విమర్శించారు. సుప్రీంకోర్టుకు పోతే తప్ప ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడమేగాక దీక్షా శిబిరానికి కరెంటు, వాటర్ బంద్ చేయడం, శిబిరాన్ని పోలీసులు ధ్వంసం చేసి బాధితులపై భౌతికంగా దాడి చేయడం మహిళల రక్షణ పట్ల మోడీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. బిజెపి ఎంపీ ని తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఎంపీ పదవితో సహా అన్ని పదవులు నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రౌండ్ టేబుల్ సమావేశం ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

రైతులకు విత్తనాలను అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాంబిల్లి : మండలంలో జెడ్. చింతువా గ్రామంలో శనివారం నాడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కార్యక్రమం అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేసినట్లు మండల వ్యవసాయాధికారి సి.సుమంత తెలిపారు.ఈ సందర్భంగా ఆమె రాంబిల్లి మండలానికి సంబంధించి ఖరీఫ్ 2023 సీజన్ కు 50 క్వింటాళ్ల జీలుగ,14 క్వింటాళ్ల పిల్లి పెసర,2.5 క్వింటాళ్ల జనుమ మొదలైన పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు ఆమె మీడియాకు తెలియజేశారు. మండలానికి సంబంధించి 8779 మంది రైతులకు రూ.5000చొప్పున రూ.4,82,84,500లు ఈ నెల 30న తారీఖున రైతుల ఖాతాలలో జమ చేయనున్నట్లు ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ సుకుమార్ వర్మ,జెడ్పిటీసీ దూళి నాగరాజు, ఎంపీపీ జి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారును వినియోగంలోకి తీసుకురండి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : స్థానిక రైతు బజారును వినియోగంలోకి తీసుకు రావాలని ఇన్చార్జి సబ్ కలెక్టర్, ఐటిడి ఏపిఓవి. అభిషేక్ ఆదేశించారు. అంబేద్కర్ కూడలిలో ఉన్న రైతు బజారును, రహదారులు భవనాల శాఖ నివాస సముదాయంలో ఉన్న ఖాళీ స్థలాన్ని రెవెన్యూ అధికారులు, ఎంపిడిఓ, సచివాలయం సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. చిరు వ్యాపారులకు మార్కెట్ సదుపాయాలు కల్పించడానికి అనుకూలతలు పరిశీలించి సూచించారు. స్థానికంగా మార్కెట్ ఏర్పాటు చేయడానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు తాహశీల్దార్ వి.త్రినాధరావు నాయుడు, ఎంపిడి ఓ, పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్నా! మద్యపాన నిషేధం ఇదేనా.

విశాలాంధ్ర - పెందుర్తి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో మద్యపానాన్ని పూర్తి స్థాయిలో నిషేధిస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని పెందుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విన్నకోట రాము విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్నప్పటికీ మద్యపాన నిషేధం అమలు కాలేదు సరికదా మరింత పెరిగిందని ఆక్షేపించారు. దీనివల్ల మందుబాబులు బ్రాందీ షాపులు వద్ద తప్ప తాగి వీరంగం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. చిన ముసిడివాడలో ఉన్న బ్రాందీ షాపులో మద్యం తాగుతున్న మందుబాబులు అటు వైపు వెళ్తున్న మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని రాము ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై విన్నకోట రాము, ఎయిర్ ఫోర్స్ మాజీ అధికారి ఎన్ నాగభూషణ్ తదితరులు శనివారం పెందుర్తి ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎక్సైజ్ ఎస్సై కిరణ్ అక్కడకు వచ్చి విచారణ చేపట్టారు. చుట్టుపక్కల గల కిరాణా షాపుల యజమానులకు మందు బాబులకు వాటర్ ప్యాకెట్లు, మందు త్రాగే గ్లాసులు వంటివి అమ్మొద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుపై సకాలంలో స్పందించిన ఎక్సైజ్ ఎస్సై కిరణ్ కు విన్నకోట రాము అభినందనలు తెలియజేశారు. అలాగే స్థానిక మహిళలు రాము సేవాభావానికి కృతజ్ఞతలు తెలియచేసారు.

మండల బీజేపీ అధ్యక్షుడుగా కారే రాముడు నియామకం

విశాలాంధ్ర - రాంబిల్లి : మండల బీజేపీ అధ్యక్షుడుగా వాడన ర్సాపురం గ్రామానికి చెందిన కారే రాముడు నియమితులైనారు. ఈ మేరకు శనివారం చోడవరంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పివిఎస్ మాధవ్, రాష్ట్ర కిసాన్మోర్చ అధ్యక్షుడు సూర్యనారాయణరాజు, యలమంచిలి నియోజకవర్గ కనిర్వనర్ రాజాన సన్యాసినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి బివిఎస్ వర్మరాజు, కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకుడు ధర్మాల గోవిందరెడ్డిలు కారే రాముడుకి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కారే రాముడు మాట్లాడుతూ పార్టీ తనకు ఇచ్చిన మండల అధ్యక్ష పదవిని సద్వినియోగం చేసుకొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేసి పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ తీసుకువచ్చేందకు పాడుపడతానన్నారు. ఇదివరకేతాను రెండు పర్యాయాలు రాంబిల్లి మండల బీజేపీ అధ్యక్షుడుగా పనిచేశానన్నారు. మరోమారు పార్టీ మండల అధ్యక్ష పదవిని ఇచ్చిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కెజీబివిల సరుకుల పంపిణీకి టెండరు ఖరారు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : కెజిబివి పాఠశాలలకు సరుకులు పంపిణీకి శనివారం జరిగిన సమావేశంలో ఖరారు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన నిత్యావసర సరుకులు సరఫరా చేయాలన్నారు. జూన్ 12 నాటికి నిత్యావసర సరుకులు, కూర గాయలు, గుడ్లు, పాలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. అవినీతికి తావు లేకుండా బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. మూడు నెలలకు మాత్రమే టెండరు ఖరారు చేసామని పేర్కొన్నారు. మూడు నెలల అనంతరం మార్కెట్ ధరలను పరిశీలించి తిరిగి టెండరు నిర్వహిస్తామన్నారు. సరుకుల పంపిణీ పారదర్శకంగా ఉండాలని, నాణ్యమైన సరుకులు పంపిణీ చేస్తే రెండవ సారి అవకాశం కల్పిస్తామని అన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన రెండు రోజుల్లో కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు బిల్లులు సమర్పించాలని అందుబాటులో ఉన్న నిధులను పరిశీలించి వేగంగా బిల్లులు చెల్లిస్తామన్నారు. మిరియాలను స్థానిక రైతుల నుండి కిలో రూ.525 లకు కొనుగోలు చేసి సరఫరా చేస్తే ఆమేరకు బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. కాఫీ, మిరియాలు సాగు చేస్తున్న గిరిజన రైతులను ప్రోత్సహించి గిట్టుబాటు ధరలు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి ఇ ఓ సలీం భాషా, పౌర సరఫరాల శాఖ డి ఎం, బి. గణేష్ పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణకు విఘాతం కలిగించవద్దు...

జిల్లా టాస్కోర్స్ కమిటీ నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : వివిధ రంగాల్లో ఉన్న బాలల హక్కుల రక్షణకు విఘాతం కలిగించవద్దని జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు అభి.ప్రాయపడ్డారు. కలెక్టరేట్లో డిఆర్ఓ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రంగంలో బాల కార్మికులుగా ఎవరైనా పని చేస్తే వారిని గుర్తించి, వారికి పునరావాసం కల్పించి, విద్యాహక్కును అమలు చేసేలా జిల్లాలో 17 మంది వివిధ శాఖల అధికారులతో కమిటీ పర్యవేక్షణ చేస్తుందని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం సునీత తెలిపారు. ముఖ్యంగా డ్రాప్ అవుట్స్ విద్యార్థులను గుర్తించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేర్పించే బాధ్యత ఈ కమిటీ తీసుకుంటుందన్నారు. బాలల హక్కుల కమిషన్ జిల్లా టాస్కోర్స్ కమిటీ తీసుకుని నిర్ణయాలను తెలియజేస్తామని తెలియజేశారు.

ఆశాకార్యకర్త మృతికి సంతాపం

విశాలాంధ్ర - హుకుంపేట : మండలంలోని గన్నేరుపుట్టు పంచాయితీ డొంకినివలస గ్రామానికి చెందిన ఆశాకార్యకర్త మజ్జి ఈశ్వరమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు స్థానిక జడ్పిటీసీ సభ్యుడు రేగం మత్యలింగం స్థానిక నాయకులతో కలిసి గన్నేరుపుట్టు గ్రామానికి చేరుకుని మృతురాలి పార్థివ దేహానికి పూలమాలతో నివాళిలు అర్పించారు. అనంతరం కుటుంబానికి పరమార్శించారు. ఆమేకు భర్తతో పాటు ఇద్దరు చిన్నపిల్లలు ఉండడంతో ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి అన్ని విదాలుగా ఆదుకుంటామని జడ్పిటీసీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదరి నైని సతిబాలు, వైస్ ఎం పిపి ఎస్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వై.ఎస్సార్ పశు భీమా పథకం పాడి రైతులకు ఎంతో మేలు

విశాలాంధ్ర - చోడవరం : వ్యాధులు లేదా ప్రమాదవశాత్తు పశువులు, జీవాలు మరణిస్తే వాటిని పోషించే పాడి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం వై.ఎస్సార్ పశు భీమా పథకం ప్రవేశ పెట్టింది. ఈ పథకం క్రింద మూడు సంవత్సరాల కాల పరిమితికి వైట్ కార్డు ఉన్న రైతులు (దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు) 20%, రేషన్ కార్డు లేని వారు 50% ప్రీమియంను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రంలో ఆన్లైన్ లో చెల్లించాలని అధికారులు తెలియజేశారు. పశువులకు మూడు సంవత్సరాలు, గొర్రెలు మేకలు పందులు వంటి జీవాలకు 1 లేదా 2,3 సంత్సరాల పాటు భీమా వర్తిస్తుంది. పరిహారం కోసం నెలలు, సంత్సరాల పాటు కాల యాపన లేకుండా, ఎదైనా పశు నష్టం సంభవించిన 21 రోజుల్లోగా లబ్ధి దారుల బ్యాంక్ ఖాతా లోకి పరిహారం జమ అయ్యేలా నిభందనలు విధించారు. ఏదైనా సాంకేతిక కారణాలతో పరిహారం జమ కాకపోతే ఆ విషయాన్ని ఆన్లైన్ లో పోర్టల్ లో వుంచుతారు. నిర్దేశించిన భీమా వివరాలు :- 1. ఆవులు/గేదెలు/మగ పశువులకు మూడేళ్ళకు - 6.4%, 2. గొర్రెలు/మేకలు/పందులకు ఒక సంవత్సరానికి 3%, రెండు సంవ్సరాలకు 4.5%, మూడేళ్లకు 6.25% ప్రభుత్వం నిర్దేశించిన భీమాకు ప్రీమియం ఆన్లైన్లో చెల్లించాలి. భీమా పథకం అమలు వివరాలు :- రెండు నుండి 10 సంవత్సరాలు వయస్సు కలిగి, ఒక్కసారైన ఈనిన ఆవులకు, 3 నుండి 12 సంవత్సరాలు వయస్సు కలిగి ఒక్కసారైనా ఈనిన గేదెలకు (ఒక కుటుంభానికి గరిష్టంగా 5 పశువుల వరకు) భీమా పథకం వర్తిస్తుంది. 6 నెలల వయస్సు మరియు 6 నెలల వయస్సు పై బడిన గొర్రెలు/మేకలు/పందులకు (ఒక కుటుంభానికి గరిష్టంగా 50 జీవాలకు/ పందుల వరకు) భీమా పథకం వర్తిస్తుంది. దేశవాళి మరియు సంకర జాతి ఆడ మరియు మగ పశువులకు రూ.30,000ల వరకు, నాటు జాతికి చెందిన ఆడ మరియు మగ పశువులకు రూ.15,000ల వరకు, గొర్రెలు, మేకలు, పందులకు రూ.6,000ల వరకు ప్రభుత్వ సబ్సిడీ తో భీమా సౌకర్యం కలుగజేస్తారు. లబ్ధి దారుడు ప్రభుత్వ నిర్ణీత భీమా మొత్తానికన్నా ఎక్కువ మొత్తానికి భీమా చేయించకొదలచితే ఆ పై మొత్తానికి పూర్తి ప్రీమియం చెల్లించాల్సి వుంటుంది. ఆవులు/గేదెలులో గరిష్టంగా రూ.1,20,000లు వరకు, గొర్రెలు/మేకలు/పందులులో గరిష్టంగా రూ. 15,000ల వరకు భీమా చేయించుకునే సదుపాయం ఉంది. సబ్సిడీ తో ప్రీమియం వివరాలు :- (1). దేశవాళి మరియు సంకర జాతి ఆడ మగ పశువులకు మూడు సంవత్సరాలు కాలానికి రూ.30,000లు భీమా మొత్తానికి రేషన్ కార్డు ఉన్న వారు, ఎస్సీ,ఎస్టీలు 1.28% అంటే రూ.384లు రైతు వాటాగా చెల్లించాలి. రేషను కార్డు లేని వారు 3.2% అంటే రూ.984లు చెల్లించాలి. (2). నాటు జాతి ఆడ మరియు మగ పశువులకు రూ.15,000లు భీమా మొత్తానికి రేషన్ కార్డు ఉన్న వారు, ఎస్సీ,ఎస్టీల వారు 1.2% అంటే రూ.192లు, రేషన్ కార్డు లేని వారు 3.2% అంటే రూ.480లు చెల్లించాలి. (3). గొర్రెలు/మేకలు/పందులు సంవత్సర కాలానికి రూ.6,000లు భీమా మొత్తానికి రేషన్ కార్డు ఉన్న వారు ఎస్సీ,ఎస్టీ వారు 0.6% అంటే రూ.36లు, రేషన్ కార్డు లేని వారు 1.5% అంటే రూ.90లు, రెండు సంవత్సరాలకు రూ.6,000లు భీమా మొత్తానికి రేషన్ కార్డు ఉన్న వారు ఎస్సీ,ఎస్టీ వారు 0.9% అంటే రూ.54లు, రేషన్ కార్డు లేని వారు 2.25% అంటే రూ.135లు, మూడు సంవత్సరాలు కాలానికి రూ.6,000లు భీమా మొత్తానికి రేషన్ కార్డు ఉన్న వారు ఎస్సీ ఎస్టీ వారు 1.25% అంటే రూ.75లు, రేషన్ కార్డు లేని వారు 3.25% అంటే రూ.187.50లు చెల్లించాలి. లబ్ధి దారుడు పశువును వేరొక రైతుకు అమ్మివేసినా ఆ వివరాలను ఏడు రోజుల్లోగా ఆ వివరాలను తెలియజేస్తే పాలసీను కొత్త ఓనర్ కు వర్తింపజేసేలా కారీచరణ చేస్తారు. భీమా పరిహారానికి "టాగు" తప్పనిసరిగా ఉండాలని తెలియజేశారు. కావున పాడి రైతులు పశు పోషకులు ఈ భీమా పథకం ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కొరుతున్నారు.